నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
5 | హైదరాబాద్, మంగళవారం 9 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి కలెక్టరేట్, జనవరి 8 : పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీసీపీ రాజేశ్‌చంద్ర పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని హన్మాపురం గ్రామ సమీపంలోని రాచకొండ కమిషనరేట్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నేరాల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. నేరస్థులు నేర ప్రవృత్తి విడిచిపెట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల వారీగా వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

కొండపైకి ఆటోలకు అనుమతి వచ్చేనా?

- నెల గడిచినా నెరవేరని హామీ
- ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల అయ్యిలయ్య
- యాదగిరిగుట్టలో ఆశతో ఎదురుచూస్తున్న ఆటో కార్మికులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపైకి ఆటోల అనుమతి వచ్చేనా.. గతం మాదిరిగా ఆటో కార్మికులు కొండపైకి భక్తులను చేరవేసేనా అని సందిగ్ధం నెలకొన్నది. అధికారంలోకి రాగానే కొండపైకి ఆటోలను కచ్చితంగా అనుమతి ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలోనూ పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సైతం అండగా ఉంటామని మాట ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలరోజులు గడిచినా ఇచ్చిన హామీని మాత్రం నెరవేర్చలేదని ఆటో కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

యాదగిరిగుట్టలో కొండ కింద ఆటోలు

యాదగిరిగుట్ట, జనవరి8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 1400 కోట్లలో పునర్నిర్మించింది. 2022 మార్చి 28న మహాకుంభ సంప్రోక్షణను నిర్వహించి, నూతనాలయాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పునఃప్రారంభించారు. ఆలయాన్ని దర్శించుకునే భక్తులకు కొండపైకి ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించారు. అప్పటి వరకు 296 మంది ఆటో కార్మికులు కొండపైకి భక్తులను చేరవేసేవారు. కొండపైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో పాటు వివిధ కారణాలతో ఆటోలను కొండపైకి అనుమతిని నిరాకరించారు. ఆర్టీసీ బస్సులను ఉచితంగా నడిపిస్తున్న నేపథ్యంలో కొండపైకి ఆటోలను నిషేధించారు. ఆటోలకు అనుమతి ఇవ్వకపోడంతో కార్మికులు 700 రోజులు నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వారికి మద్దతుగా నిలిచి, ప్రభుత్వంలోకి రాగానే అనుమతినిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నాలు మాత్రం లేవు. ఇప్పుడు, అప్పుడంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప తమకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లేదని కార్మికులు చెబుతున్నారు. కొండపైకి అనుమతి ఉంటుందో లేదోనన్న అనుమానం కార్మికుల్లో ఉత్పన్నమవుతున్నది.

స్పష్టమైన హామీ రాలేదు

ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మాకు స్పష్టమైన హామీ మాత్రం రాలేదు. కానీ సంక్రాంతి పండుగ తరువాత అనుమతినిస్తామని చెబుతున్నారు. చాలా ఏండ్లుగా కొండను నమ్ముకుని జీవిస్తున్న మాకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. స్థానిక ఎమ్మెల్యే హామీపై గంపెడంత ఆశతో ఉన్నాం.

– ర్యాకల రాజు, బీఆర్ఎస్‌కేవీ ఆటో యూనియన్ అధ్యక్షుడు, యాదగిరిగుట్ట

సంక్రాంతి తరువాత అంటున్నారు

కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఓట్లు వేశాం. కొండపైకి అనుమతినిస్తామని చెప్పారు. రెండు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కలిశాం. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో మా సమస్యను వివరించారని చెప్పారు. సంక్రాంతి తరువాత తప్పకుండా కొండపైకి అనుమతిని ఇస్తామని ఎమ్మెల్యే బీర్ల హామీనిచ్చారు.

–గడ్డమీది దేవేందర్, కేకేసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు, యాదగిరిగుట్ట

గుట్టలో లక్ష్మీనృసింహ స్వామి తిరు కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, జనవరి8 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణ వేడుకను జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని వీక్షించారు.

యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నిత్య పూజలు

తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి తులసి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ తిరువీధి సేవ, దర్బార్ సేవను వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామి వారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అర్చకులు వేద మంత్రాలు పఠిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు నిర్వహించారు. గోదాదేవి శ్రీరంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు నిర్వహించారు.

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు

ప్రజావాణి సమస్యలపై సత్వరమే స్పందించాలి

- అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 8 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 27 దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు–15, జిల్లా పంచాయతీ కార్యాలయానికి–4, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, ఉపాధి కల్పన శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, జిల్లా స్థాయి అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

ఎంజీయూ పరిధిలో 16 వరకు సంక్రాంతి సెలవులు

రామగిరి, జనవరి 8: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలలకు గతంలో ప్రకటించిన సంక్రాంతి సెలవుల్లో మార్పులు చేసినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ నెల 7 నుంచి 15 వరకు సెలవులు ప్రకటించగా వాటిని ఈ నెల 7నుంచి 16 వరకు పొడిగించామని పేర్కొన్నారు. 17న కళాశాలలు పునఃప్రారంభం చేయాలని సూచించారు.

దళిత బంధు లబ్ధిదారులతో కలిసి నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

దళితబంధు యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలి

- దళితుల ఆశలను అడియాశలు చేయొద్దు
- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద దీక్ష

నల్లగొండ, జనవరి 8 : నల్లగొండ నియోజకవర్గంలో దళితబంధు కింద ఆర్థిక సాయం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 1100 మంది నిరుపేద దళితులను ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినందున వారికి వెంటనే దళితబంధు యూనిట్లను మంజూరు చేస్తూ గ్రౌండింగ్ చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ నియోజకవర్గంలో తొలి విడుతగా 100 మంది లబ్ధిదారులకు దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసి వారికి కావాల్సిన యూనిట్లు మంజూరు చేయడంతో నేడు వారంతా సంతోషంగా జీవిస్తున్నట్లు తెలిపారు. దాంతో రెండో విడుత కింద 1100 మందిని ఎంపిక చేసి గత ఎన్నికల ముందు ప్రొసీడింగ్స్ అందజేయగా ఎన్నికల కోడ్‌తో అది ఆగిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ పథకం కింద యూనిట్లు వస్తాయని ఆశపడ్డ దళితుల ఆశలు వమ్ము అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి పాటుపడాలని, అందుకు వెంటనే లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దళితబంధు సాధన కమిటీ కన్వీనర్ పాలడుగు నాగార్జున మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమైనా ఒక చట్టం చేస్తే, ఆ తర్వాత వచ్చే ప్రభుత్వం దానిని అమలు చేసే బాధ్యతను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే ప్రభుత్వాలు చేసే చట్టాలకు, పథకాలకు విలువ ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, నల్లగొండ మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, బకరం వెంకన్న, అద్దంకి దయాకర్, కందుల లక్ష్మయ్య, బడుపుల శంకర్, చింత సైదులు, కందుల రమేశ్, విమలమ్మ, యాదమ్మ, జాకటి బాలరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అధికారులను అడిగినా పట్టించుకోవట్లే..

దళితులు ఆత్మగౌరవంగా జీవించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం తెచ్చింది. నా పేరున దళితబంధుకు దరఖాస్తు చేస్తే ఎంపికవడంతో అధికారులు నాతో బ్యాంకు ఖాతా తీయించారు. సూపర్ మార్కెట్, బ్యూటీ పార్లర్, కారు కొనుగోలుకు సంబంధించి యూనిట్లను ఎంపిక చేసుకున్నాం. అధికారులు వీటిలో ఒకటి ఇస్తామన్నారు. ప్రభుత్వం మారడంతో దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదు. అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. రెక్కాడితే డొక్కాడని బతుకులు మావి. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే గత ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇచ్చిన వారందరికీ యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి.

– బొల్లు క్రాంతి, అక్కచెల్మ

ప్రభుత్వం స్పందించాలి

కేసీఆర్ సర్కారు తెచ్చిన దళితబంధు పథకంతో నా జీవిత కల సాకరమైందని ఆశ పడ్డాను. దళిత బంధులో ట్రాక్టర్, కారు, టెంట్‌హౌజ్ పెట్టుకున్నా. స్వయానా అప్పటి జిల్లా కలెక్టరే నాకు ప్రొసీడింగ్స్ కాపీ అందజేశారు. కానీ, నేడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దానిని పట్టించుకోకపోవడం దారుణం. ప్రస్తుతం కూలి చేసుకుంటూ జీవనం గడుపుతున్నా. ఆలస్యం చేయకుండా ప్రభుత్వం తక్షణమే దళితబంధు యూనిట్ల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలి.

–బాకి నర్సింహ, అన్నెపర్తి, నల్లగొండ

సీసీబీలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

డిపాజిట్ల సేకరణకు మాసోత్సవాలు

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- సహకార బ్యాంక్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నల్లగొండ, జనవరి 8 : జనవరి 1 నుంచి ఫిబ్రవరి 29 వరకు సహకార బ్యాంకుల పరిధిలో డిపాజిట్ల సేకరణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పాటు సహకార బ్యాంకుల్లో డిపాజిట్ల మాసోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు డిపాజిట్లను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం డీసీసీబీలో రూ.665 కోట్ల డిపాజిట్లు ఉంటే, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.103 కోట్లు సేకరించినట్లు తెలిపారు. ఇంకా మూడు నెలల సమయం ఉన్నందున మరిన్ని డిపాజిట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అలాగే బంగారు రుణాల విషయంలో ఏ బ్యాంకులు కూడా ఇవ్వని విధంగా గ్రాముకు రూ.4,500 రుణం ఇవ్వడంతోపాటు 9.9 శాతం మాత్రమే వడ్డీ విధిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం డిపాజిట్ల మాసోత్సవాల్లో భాగంగా ధన సమృద్ధి డిపాజిట్ కింద 333 రోజులకు గానూ 7.75 శాతం, ధనవర్ష డిపాజిట్ కింద 111 రోజులకు 6.50 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై ఐదు లక్షల వరకు బీమా సౌకర్యం ఉందని, కేవలం పది నిమిషాల్లోనే రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, సైదులు, అంజయ్య, రంగాచారి, రాంచందర్, జయరాం, శ్రీనివాస్, కరుణ, అనూరాధ పాల్గొన్నారు.

ఎన్ఐటీ-వరంగల్‌తో కలిసి పరిశోధనలు చేపడుతాం

- బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, జనవరి 8 : నిట్–వరంగల్‌తో కలిసి పరిశోధన కార్యక్రమాలు చేపడుతామని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. సోమవారం మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో అకడమిక్ అండ్ రీసెర్చ్ సహకారం కోసం ఎన్ఐటీ వరంగల్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి ఆ సంస్థ డైరెక్టర్ బిద్యాదర్ సుబూది ఆధ్వర్యంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకడమిక్ అండ్ రీసెర్చ్ ఎక్సలెన్స్‌ను పెంపొందించే దిశగా గణనీయమైన పురోగతిలో ఆలిండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు అవగాహన ఒప్పందాన్ని చేపట్టామన్నారు. ఈ ఒప్పదం ద్వారా రెండు ప్రతిష్టాత్మక సంస్థల మధ్య విజ్ఞానం, వనరులు, నైపుణ్యంలో పరస్పర మార్పిడికి మార్గం సుగమం కానున్నట్లు తెలిపారు. ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం పరిధిని పెంపొందిస్తూ మెడికల్, ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయం కోసం ఈ సహకారం ఉంటుందన్నారు. ఇది క్రాస్ డిసిప్లినరీ లెర్నింగ్ అవకాశాలను, జాయింట్ సెమినార్లు, వర్క్ షాప్‌లు, అకడమిక్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్‌లను అనుమతిస్తుందని, మేధో వృద్ధి, ఆవిష్కరణల వాతావరణాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపన కోసం ఉమ్మడి ప్రతిపాదన గుర్తించదగిన అంశమన్నారు. ఏఐ రంగంలో పరిశోధన, అభివృద్ధికి అత్యాధునిక సదుపాయాన్ని బీబీనగర్ ఎయిమ్స్, ఎన్ఐటీ వరంగల్ ముందే ఊహించినట్లు తెలిపారు. ఈ రెండు సంస్థలు భవిష్యత్‌లో సంచలనాత్మక పరిశోధనలు, పరివర్తనాత్మక విద్య, సమాజానికి అర్థవంతమైన సహకారాలు అందించనున్నట్లు చెప్పారు.

అవగాహనా ఒప్పందాన్ని మార్చుకుంటున్న బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ బిద్యాదర్ సుబూది

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

లేదంటే డీడీ డబ్బులైనా తిరిగివ్వాలి

- గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్
- గొల్ల కురుమలతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన

గొల్లకురుమలతో కలిసి నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్

నల్లగొండ, జనవరి 8 : రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 7,850 మంది అర్హులు డీడీలు చెల్లించారని, వారందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని, లేకుంటే డీడీల డబ్బులైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట లబ్దిదారులు ధర్నా చేశారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో 62 వేల మందికి గొర్రెల యూనిట్లు ఇస్తామని తొలి విడుతలో 32 వేల మందికి ఇచ్చిందని, రెండో విడుతలో 30 వేల మందికి ఇవ్వాల్సి ఉండగా.. వారిలో ఇప్పటి వరకు సబ్సిడీ పోను ఒక్కొక్కరి దగ్గర రూ.43,750 డీడీల రూపంలో మొత్తంగా రూ.34.34 కోట్లు సేకరించి కలెక్టర్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. వారికి యూనిట్లు ఇచ్చే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చి ఆగిపోయినందున డీడీలు చెల్లించిన వారికి వెంటనే యూనిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే కట్టిన డీడీలు అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే వినతిపత్రం ఇచ్చే సమయంలో కలెక్టర్‌తో పాటు కలెక్టరేట్ ఏఓలు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదవసంఘం అధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య, కార్యదర్శి చలకాని మల్లేశ్, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్రన్న, నాగార్జునసాగర్ అధ్యక్షుడు కుంటిగొర్ల లింగయ్య, నకిరేకల్ అధ్యక్షుడు చింతల సందీప్, మునుగోడు అధ్యక్షుడు గుండెబోయిన వెంకటేశ్, ఆయా మండలాల అధ్యక్షులు పాక రమేశ్, కన్నెబోయిన అంజిబాబు, జానపాటి శంకర్, బుర్ర వెంకటయ్య, బండారి శంకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గొర్రెలు ఇవ్వకపోతే డీడీ డబ్బులైనా ఇవ్వండి

గత ప్రభుత్వం రెండో విడుత గొర్రెల పంపిణీ కింద నాకు యూనిట్ ఇస్తానంటే వ్యక్తిగత వాటా కింద రూ.43,750 ఎస్‌బీఐలో డీడీ తీసి పశు సంవర్ధక శాఖ అధికారులకు అందజేశాను. డీడీలు కట్టి ఇప్పటికే రెండు నెలలు అవుతున్నది. ఇన్ని రోజులు ఎన్నికలు అని ఆపిండ్రు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయినందున నాకు సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేయాలి. లేకుంటే డీడీ డబ్బులైనా ఇవ్వాలి.

– చింతల సందీప్, మంగళపల్లి, నకిరేకల్ మండలం

రామనంద తీర్థలో సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 8 : మండలంలోని జలాల్పూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిర్వహించే సాంకేతిక శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ సాయిలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాలపరిమితితో కూడిన బేసిక్ కంప్యూటర్స్ డాటా ఎంట్రీ ఆపరేటర్(ఇంటర్మీడియట్ పాస్), అకౌంట్ అసిస్టెంట్ ట్యాలీ (బీకాం పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్ పాస్), టూ వీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్(పదో తరగతి పాస్), ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్(పదో తరగతి, ఐటీఐ), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ సర్వీస్(పదో తరగతి, ఐటీఐ) అర్హులని పేర్కొన్నారు. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డుతో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు స్వామి రామానంద గ్రామీణ సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.